నేటి నుంచి చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - కడప : చౌక దుకాణాల ద్వారా జూన్ 1 నుండి జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ చేయనున్నట్లు జెసి అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రేషన్ పంపిణీ కార్యక్రమం డీలర్ల ద్వారా ఆదివారాలు, సెలవు దినాలతో ఈనెల 15 వరకు పంపిణీ చేస్తారన్నారు. . నిత్యావసర సరుకులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేస్తారనితెలిపారు. పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులో ఉన్నందున, కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాప్ నుండైనా సరుకులు పొందవచ్చని, ఈ సౌకర్యాన్ని రైస్ కార్డు దారులందరూ సద్వినియోగం చేసు కోవచ్చన్నారు. 65 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు లేదా అంగ వైకల్యం ఉన్నవారు లేదా అనారోగ్యంతో ఉన్న కార్డు దారుల ఇంటి వద్దకే డీలరు 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు సరుకులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ముగిసిన జెవివి వేసవి శిబిరం

బహుమతులతో చిన్నారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా శాస్త్రంపై అవగాహన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 15 రోజులుగా వేసవి వినోదం పేరిట నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శనివారంతో విజయవంతంగా ముగిసింది. శిబిరలోలో పిల్లలు తమ వేసవి సెలవులను విలువైనవిగా మలుచుకున్నందుకు జిల్లా అధ్యక్షులు సమీర్ బాష హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు రవీంద్ర, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న విచ్చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. రానున్న సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇటువంటి వేసవి శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పరిశీలనాత్మక శక్తిని, సృజనాత్మకతను పెంచడంలో దోహదపడతాయని తెలిపారు. విజ్ఞానం సరదాగా ఎలా నేర్చుకోవచ్చు ఈ శిబిరం చూపించిందని పాఠశాల హెచ్ఎం. అంజాద్ అలీ పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు పలు శాస్త్రీయ ప్రయోగాలు, చిత్రలేఖనం, పాటలు, మ్యాజిక్, ఓరిగామి మొదలైన అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బమ్మ, రిసోర్స్ పర్సన్స్ ప్రసాద్ రెడ్డి, శిరీష, రంగనాయకులు, కామేశ్వరమ్మ, గఫూర్, సమీర్ బాష ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం : ఎస్పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విరమణ పొందిన ఎఎస్ఐలు వి.మోహన్‌రావు (ఒంటిమిట్ట పి.ఎస్), పి.భాస్కర్ (జమ్మలమడుగు పి.ఎస్), ఎఆర్‌హెచ్‌సి ఇ.రామన్న (డిఎఆర్, కడప), హెచ్‌సి బి.నారాయణ (కడప టూ టౌన్ పి.ఎస్)ను శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలు అందచేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకూ శాంతిభద్రతల పరిరక్షణకై సేవ చేస్తూ విరమణ పొందడం సంతోషకరమనానరు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం కూడా గుర్తుండిపోయేలా మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాయన్నారు. కఠిన పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం సాధారణ విషయం కాదని, నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. విరమణ పొందిన తర్వాత కూడా పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సకాలంలో రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. విరమణ పొందిన సిబ్బంది కుటుంబ వివరాలను, పిల్లల చదువులు, ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పి బి.రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి కె. శ్రీనివాసరావు, ఆర్.ఐ ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, టైటస్, డిపిఒ ఎఒ జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మీ సహకారాన్ని మరవలేను

- జిజిహెచ్ సూపరింటెండెంట్ రమాదేవి

రమాదేవి దంపతులను సన్మానిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - కడప సిటీ

జిల్లా సర్వజన ఆస్పత్రి సహచర ఉద్యోగులు అందించిన సహకారాన్ని మరువలేనని జిజిహెచ్ సూపరింటెండెంట్ జి.వి.రమాదేవి పేర్కొన్నారు. శనివారం జిజిహెచ్ మినీ ఆడిటోరియం హాలులో ఆర్ఎంఒ శ్రీనివాసులు అధ్యక్షతన ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప జిల్లా పట్ల నెలకొన్న అపోహల కారణంగా ముందుగా తటపటా యించానన్నారు. కుటుంబసభ్యులు, జిజిహెచ్ సిబ్బంది సహకారంతో సమర్థవంతంగా నిర్వహించానన్నారు. ప్రభుత్వ నిబంధనల ఆధారం గానే పలువురు వైద్యులను రీఅసెస్మెంట్ చేశానని, ఇది తన తప్పిదం కాదని గ్రహించాలని తెలిపారు. జిల్లాకు చెందిన పూర్వ కలెక్టర్లు విజయరామరాజు, లోతేటి శివశంకర్, ప్రస్తుత కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నుంచి పాలనా పరమైన మెళకువలు గ్రహించానన్నారు. వారి సహకారంతో మరింత బాగా విధులు నిర్వహించానని చెప్పారు. ఆర్ఎంఒ శ్రీనివాసులు మాట్లాడుతూ సూపరింటెండెంట్ రమాదేవి సమర్థవంతంగా విధులు నిర్వహించారని చెప్పారు. కడప, కర్నూలు కలెక్టర్ల నుంచి పలు ప్రశంసా పత్రాలు అందుకున్నారని తెలిపారు. చెవి, గొంతు, ముక్కు డాక్టర్ ఫరూఖ్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ రమాదేవి డాక్టర్స్ అసోసియేషన్‌కు గది కేటాయింపు విషయమై ఆమె దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించారని తెలిపారు. జిజిహెచ్‌కు ఎదుర్కొనే ప్రధాన సమస్యల పట్ల వేగవంతంగా నిర్ణయాలు తీసు కుంటూ పాలనాదక్షత కనబరిచారన్నారు. కార్యక్రమంలో జిజిఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ జమున, డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హిమజ, జిజిహెచ్ ఆర్ఎంఒ రాజ్యలక్ష్మీ, ఎఒ రంగస్వామి, పీడియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ పెంచలయ్య, పలువురు వైద్యులు, జూనియర్ వైద్యులు, జిజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

మురళీమోహన్‌ను సన్మానిస్తున్న భూపేష్‌రెడ్డి

శేష జీవితం ఆనందంగా గడపాలి

- జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితం ఆనందంగా గడపాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం డిఇఒ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఇండ్ల మురళీమోహన్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 సంవత్సరాల పాటు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా పనిచేసిన మురళీమోహన్ ఎంతోమందికి సహకారం అందించారని తెలిపారు. పాఠశాలను వదిలి విద్యార్థులు వెళితే ఎంత బాధ ఉంటుందో, అధికారులు ఉద్యో విరమణ పొందేటప్పుడు అలాంటి బాధే ఉంటుందని చెప్పారు. విద్య కోసం నిరంతరం పాటు పడ్డారని తెలిపారు. డిఇఒ షంషుద్దీన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో రాజీ పడకుండా పనిచేశారని కొని యాడారు. కుటుంబ సభ్యులతో శేష జీవితం ఆనందంగా గడపాలని పేర్కొ న్నారు. పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని విషయాలలో ఒక సోదరుడుగా సాయంచేశారని తెలిపారు. సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరితో ఆప్యాయతగా ఉండేవారని తెలిపారు. విధుల్లో కచ్చితంగా ఉంటారని చెప్పారు. కడప, జమ్మలమడుగు, కర్నూల్, అన్నమయ్య జిల్లాలో పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురివిరెడ్డి, రమణయ్య, రాజగోపాల్ రెడ్డి, మురళీమోహన్ భార్య విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడప నుండి ఎర్రగుంట్ల మీదుగా గుంతకల్లుకు ప్రత్యేక రైలు

ప్రజాశక్తి - కడప : ఈనెల 2 నుండి కడప - గుంతకల్లు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్లు యర్రగుంట్ల స్టేషన్ మాస్టర్ తెలిపారు. కడప నుండి తిరుపతి మీదుగా విశాఖపట్నం వెళ్లు తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప నుండి గుంతకల్లు వరకు సాధారణ ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నారన్నారు. 4 జనరల్ బోగీలలో సాధారణ టిక్కెట్స్ తీసుకొని ప్రయాణం చేయడానికి అనుమతి లభించిందని పేర్కొన్నారు. గతంలో తిరుమల ఎక్స్ ప్రెస్ కడప నుండి సాధారణ ఎక్స్‌ప్రెస్‌గా కొండాపురం వరకు నీటిని నిపుకొనుటకు ఖాళీగా నడపాల్సి వచ్చేదని, యర్రగుంట్లలో రైలు సిబ్బంది డ్యూటీ మార్చుకొనుటకు ఉండేది, కానీ ప్రయాణికులు ఎక్కుటకు అవకాశం ఉండేది కాదని తెలిపారు.ఇప్పుడు కడప నుండి యర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాలకు జనరల్ టికెట్స్‌తో ప్రయాణికులకు అందుబాటులో రానుంది. కడప-ఉదయం 7.45, యర్రగుంట్ల-8.13, కొండాపురం-8.39, తాడిపత్రి-9.13,గుత్తి-10.03, గుంతకల్లు-ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుంది. తిరుగుప్రయానంలో గుంతకల్లు-మధ్యాహ్నం 13.30, గుత్తి-13. 55, తాడిపత్రి-14.20,కొండాపురం-15.13, యర్రగుంట్ల-15.43, కడప-సాయంత్రం 17.15 గంటలకు సాధారణ ఎక్స్‌ప్రెస్ గా చేరుకొని సాయంత్రం 17.45గం. లకు కడప-విశాఖపట్నం తిరుమల ఎక్స్ ప్రెస్‌గా వెళ్తుంది.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ అడ్మిషన్లు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా అడ్మిషన్లు ప్రారంభిస్తూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసే విధంగా వేల, లక్షల రూపాయలు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం కేవలం ప్రయివేట్, కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో విద్యాసంస్థలు దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేసే రకంగా చర్యలు తీసుకోవాలని, అనుమతులేని విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య శ్రీనివాస్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్‌గా బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వ విద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల పత్రాలను ఆచార్య శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ శ్రీనివాస్ కు అందజేశారు. ప్రిన్సిపల్ పోస్టుతోపాటూ కడపలోని వైవీయూ హాస్టళ్ల (బాలురు, బాలికలు) చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ప్రిన్సిపల్, వసతిగృహాల చీఫ్ వార్డెన్‌గా ఉన్న ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి ఉద్యోగ కాలం పూర్తి కావడంతో బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు.

రైలు కింద పడి ఎఎస్ఐ ఆత్మహత్య

ప్రజాశక్తి - కడప

పురుషోత్తంనాయక్ (ఫైల్)

కడప పోలీసు కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న ఎఎస్ఐ బుక్కే పురుషోత్తంనాయక్(53)కనుమలోపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసు కథనం మేరకు.. చక్రాయిపేట మండలం కల్లూరుపల్లె తాండకు చెందిన బుక్కే పురుషోత్తం నాయక్ కడప పోలీసు కంట్రోల్ రూమ్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహి స్తున్నారు. ఈమేరకు సిద్దవటం మండలం కనమలోపల్లె గ్రామరైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శనివారం ఉదయం 6.35 గంటలకు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఆయనకు నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో కాలు తీవ్రంగా గాయం అవడంతో ఆపరేషన్ చేశారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు, మహానాడు కార్యక్రమాలకు డ్యూటీలో వేయ డంతో అక్కడ నిల్చుని చాలా ఇబ్బందులు పడ్డారని ఆయన కుటుంబీకులు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, ఇద్దరు కూమార్తెలున్నారు. అందరికీ వివాహాలు అయ్యాయి. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్త కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

శిక్షణా తరగతులు వాయిదా వేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న బి.లక్ష్మీరాజా

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధ్యాయ శిక్షణా తరగతులను వాయిదా వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. శనివారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిచబోయే శిక్షణా తరగతులను వాయిదా వేయాలని కోరారు. రోజుకొక రూపంలో ఉపాధ్యాయ బదిలీలు గందరగోళ పరిస్థితుల మధ్య ఉపాధ్యాయులను అయోమయానికి గురి చేస్తూ ఆందోళన కలిగిస్తు న్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శిక్షణా తరగతుల కేటసం ఉపాధ్యాయులను హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేయడం సబబు కాదని తెలిపారు. ఇది పూర్తిగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసే విధంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు ముగిసేంతవరకు శిక్షణా తరగతులు, ఆడిట్ నిర్వహణ వాయిదా వేయాలని కోరారు. లేని పక్షంలో వాటిని బహిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రకాష్ బాబు, గంగన్న,అస్లాం బాష, శ్రీనివాసులు, విజయకుమార్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి శనివారం కడప నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల విద్యార్థులకు 'శక్తి' టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన 'శక్తి' యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలకు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళా, విద్యార్థులు, బాలికలు సెల్‌ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఒఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకుని సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'గొడ్డలిపోటు దినం' నిర్వహించుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైసిపి వెన్నుపోటు దినోత్సవం కాదు...గొడ్డలి పోటు దినోత్సవం నిర్వహించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. శనివారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడ్డలి పోటుతో సొంత చిన్నాన్నను చంపిన జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నేతలు వెన్నుపోటు గురుంచి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తల్లిని, చెల్లిని రోడ్డున పడేసి జగన్‌ను నిలదీయలేని వెన్నుపో టుదారులు కడపలో జరిగిన మహానాడు చూసి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైసిపి నాయకులు ఇంకా మారకపోవడం దురదృష్టమని చెప్పారు. వచ్చే మహానాడుకు జగన్ పార్టీ నామరూప లేకుండా పోతుందని ఎద్దేవ చేశారు. గత ఐదు సంవత్సరాల రాక్షస పాలనలో దౌర్జన్యాలు, హత్యలు, దాడులతో కొనసాగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలు సుఖః సంతోషాలతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో, రాయలసీమలో అభివృద్ధి జరిగిందంటే అది చంద్రబాబు తోనేనని చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టుల రూపకల్పనలో సిఎ చంద్రబాబు ఒక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. రాయలసీమను రత్నాల సీమగా మారుస్తామని మహానాడు వేదికగా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. మహానాడుకు లక్షలాదిగా ప్రజలు తరలి వస్తే లేనిపోని ఆరోపణలు చేయడం వైసిపి నేతలకు తగదన్నారు. గొడ్డలి పోటు వల్లే గత ఎన్నికల్లో ప్రజలు వైసిపికి 11 సీట్లు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఒక సీటుకు పరిమితం అవుతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు గంధం ప్రసాద్, రామచంద్రయ్య, సాయి పాల్గొన్నారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా పెంచలయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డెర్మటాలజీ హెచ్ఒడి డాక్టర్ పెంచలయ్య నియమితులయ్యారు. శనివారం జిజిహెచ్ సూపరింటెండెంట్ జి.వి.రమాదేవి ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ (ఎఫ్ఎసి) బాధ్యతలను పెంచలయ్యకు బాధ్యతలు అప్పగించారు. ఆయన జిజిహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతలను ఆదివారం నుంచి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సాలేనాగయ్య వీధిలోని క్రిసెంట్ ఇంగ్లీషు మీడియం ఉన్నత బాలికల పాఠశాలలో 40 రోజుల పాటు ఉచిత ఉర్దూ శిక్షణ ముగింపు సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు అమీర్‌బాబు మాట్లాడుతూ ఉర్దూ మాతృభాషను ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని, ఉర్దూ భారతీయ భాష అని, మాతృభాషతోనే మనుగడ సాధ్యమని చెప్పారు. అంజుమన్ వారు ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన అంజుమన్ అధ్యక్షులు సత్తార్ ఫైజీ మాట్లాడుతూ దాదాపు 65 మంది తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పాల్గొని ఉర్దూ నేర్చుకోవడం హర్షదాయకమన్నారు. మాతృభాష నేర్చుకుంటే ఇతర భాషలు సులభంగా అర్థం అవుతాయన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మస్తాన్ బాష మాట్లాడుతూ అంజుమన్ కార్యవర్గ సభ్యుడు టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జిలాని బాష ఉర్దూ నేర్చుకొనుటకు తమ పాఠశాల కేటాయించడం అభినందనీయమన్నారు. జిలాని బాష మాట్లాడుతూ ఉర్దూ భాష వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీలు అభివృద్ధి చెందాలని చెప్పారు. డిసిసి మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ నేర్చు కుంటే అంజుమన్ కార్యదర్శి హిదాయతుల్లా, డాక్టర్ మస్తాన్ బాష ఉచిత ఉర్దూ శిక్షణ కోర్సు కో- ఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ డలాజక్ కోశాధికారి నజీర్ బాషాను సన్మానించారు. కార్యక్రమంలో అంజుమన్ కార్యవర్గ సభ్యులు అయ్యూబ్, సిరాజుద్దీన్ బుఖారి రహమతుల్లా, ఇర్షాద్ అహ్మద్ వహీద్ పాల్గొన్నారు.

నేటి నుంచి కడపలో అండర్-23 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నేటి నుచి కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ టోర్నమెంటులో కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల జట్లు పాల్గొననున్నాయి. శనివారం అన్ని జిల్లాల జట్లు కడపకు చేరుకున్నాయి. టోర్నమెంట్‌కు సంబంధించి మ్యాచ్ లు సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. మైదానాలను పిచ్ క్యూరేటర్ బాలరాజు, హరి ఆటకు అణువుగా సిద్ధం చేశారు. టోర్నమెంట్ ప్రారంభ రోజు ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం, నెల్లూరు చెట్ల మధ్య వన్డే మ్యాచ్‌లుంటాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భరత్ రెడ్డి, రెడ్డి ప్రసాద్ తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు, బద్వేల్ ఎమ్మెల్యే సుధా

4న వెన్నుపోటు దినం : వైసిపి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు మోసాలను ఎండబడుతూ ఈనెల 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనలో ఓటు వేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజలతో కలిసి అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసనలతో చంద్రబాబు నాయుడు కళ్లు తెరిపిస్తామని చెప్పారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి వచ్చి జూన్ 4 నాటికి ఏడాది అవుతుందన్నారు. అధికారంలో వచ్చిన తొలిరోజు నుంచే ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ, ఏడాదిలోనే 99 శాతం అమలు చేసిన ఘనత వై.ఎస్.జగన్‌ది అన్నారు. 1995లో సొంత మామనే వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తరువాత 1999, 2014, 2024లోనూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, షఫీ, అధినిమయపల్లి శంకర్‌రెడ్డి, యానదయ్య, వెంకటేశ్వర్లు, దాసరి శివ, షఫీ పాల్గొన్నారు.

యోగా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కడప : జూన్ 1న స్థానిక వైఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించబోయే యోగా కార్యక్రమ ఏర్పాట్లను శనివారం సాయంత్రం అధికారులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. స్టేడియంలోపల స్టేజి, యోగా చేసే ప్రాంగణాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.30 సెక్టార్లుగా విభజించుకుని వందమందికి ఒక అధికారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టేడియంలోని నాలుగువైపులా తాగునీటి వసతులు కల్పించాలన్నారు. అలాగే మెడికల్ టీమ్, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళి కాబద్ధంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబాలను, పిల్లలను భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు.

ఛ్ఛ్..! — ప్రజాదృష్టి

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంపై మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వాగ్దానంపై నిరుత్సాహం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట రూ.35 వేల కోట్లతో ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు రూ.15 వేల కోట్లతో మూడేళ్లలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేకపోవడం తీవ్ర నిరాశను కలిగించింది. వైఎస్ఆర్ హయాం నుంచి నేటి వరకు ముచ్చటగా మూడు సార్లు శంకుస్థాపన చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ సర్కారు నాయకత్వం రూ.తొమ్మిది వేల కోట్లతో ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసింది. మూడు దఫాలుగా చేస్తున్న వాగ్దానాల్లో వేడి క్రమేణా పరిశ్రమ పరిమాణం తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో యుపిఎ-2 సర్కారు ఇచ్చిన హామీ ఏమిటి, అనంతరం పాలకులు చేస్తున్న విన్యాసాలేమిటో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే హామీని విస్మరించి, ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో జూన్ 12న ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. వైసిపి హయాంలో కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు సొంతంగా అధికారంలోకి రావడంతో బేరమాడే అవకాశం లేదనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పడాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు రాష్ట్రంలోని టిడిపి ఎంపీల మద్దతుపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన హక్కులను, వాటాలను రాబట్టుకోవడంలో ఎన్‌డిఎ సర్కారుకు నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లను ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదనే వాదన విమర్శ వినిపిస్తోంది. ఇద్దరు నాయకుల సమిష్టి వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందనే చర్చ నడుస్తోంది. టిడిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు గత పదిహేనేళ్లుగా జిల్లాలో టిడిపికి ఒక్క స్థానమే ఇచ్చారని, పదేపదే ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌డిఎకు ఏడు స్థానాల్ని ప్రజానీకం కట్టబెట్టింది. చరిత్రలోనే లభించిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఎన్‌డిఎ మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నోన్న ఆశలు పెంచుకున్న జిల్లా ప్రజానీకాన్ని నిరాదరణకు గురిచేయడం మొదటికే మోసం వస్తుందనే సంగతిని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గాలేరు-నగరి ప్రధాన కాలువ గట్టుకు భారీ గండి

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు వెనుక జలాలను తరలించే గాలేరు-నగరి ప్రధాన కాలువ గట్టుకు భారీ గండి పండింది. ఉప్పులూరు గ్రామం నుంచి చిలమకూరు వెళ్లే దారిలోని గాలేరు-నగరి కాలువ ద్వారా సర్వరాయ సాగర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ గేట్ సమీపంలో గట్టు పైభాగాన 10 అడుగుల వెడల్పు గండి ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువకిరువైపులా కాంక్రీటుతో ఏర్పాటు చేసిన గట్టుకు ఓ వైపు కోతకు గురైంది. గట్టుకు కొద్దికొద్దిగా కోత పడితే గట్టు తెగిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కాలువ గట్టుకు మరమ్మతులు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పూసల కొట్టాలు సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కన నూతన అయ్యప్ప ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, గురుస్వాముల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి జి.రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి సూచించారు. పొగాకు ఉత్పత్తులు మన శరీరంలో ప్రతి అవయవాన్ని నాశనం చేస్తాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ 13-15 సంవత్సరాల వయసు గల విద్యార్థులు సిగరెట్లు, బీడీలు, చుట్టలు, పొగాకు ఉత్పత్తులు, గుట్కా వంటివి వినియోగిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 38శాతం సిగరెట్లు, 47శాతం బీడీలు, 52శాతం పొగలేని పొగాకు వియోగాన్ని వినియోగిస్తున్నారని వివరించారు. పొగాకు వినియోగం వల్ల ఊపిరితిత్తులు, గొంతు, కడుపు క్యాన్సర్, లుకేమియా వంటివి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్వైజర్ బాబుల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ప్రొద్దుటూరు : పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని కౌన్సిలర్ వరికుటి ఓబుల్‌రెడ్డి అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకొని శనివారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పొగ తాగడం హానికరంతోపాటు పరిసరాల్లో ఉన్న వారికి కూడా ఇబ్బందికరమన్నారు. ఖైనీ, గుట్కా, సిగరెట్, చుట్టలు, బీడీలు తీసుకోవడం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటిని వాడకూడదన్నారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివప్రసాద్ రెడ్డి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే హానిని వివరించారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, సభ్యులు చెన్నమ్మ, గంగాభవాని, రమణమ్మ, నరసింహారెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

అవగాహన రాహిత్యంతోనే విమర్శలు

- ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్

వేంపల్లె : వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి అవగాహన రాహిత్యంతో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం శోచనీయమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో జరిగిన పొరపాట్లను ఇప్పుడు విమర్శించడం చూస్తుంటే ఆ పార్టీ అధికార ప్రతినిధికి అవగాహన లేనట్లుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసిపి నేతలు పులివెందుల నియోజకవర్గాన్ని ఎన్నికలకు ముందు అభివృద్ధి పనుల పేరుతో వేంపల్లెను సర్వనాశనం చేశారన్నారు. రోడ్లన్నీ గుంతలమయం కావడానికి వైసిపి ప్రభుత్వమే కారణమన్నారు. రోడ్ల గుంతలు అవ్వడానికి కూటమి ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. అయిదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ఒక చోట కూడా రోడుపై గుంతలు పూడ్చ లేదన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు ఎల్‌బిఆర్ భాస్కర్ రెడ్డి, గోటూరు నాగ భూషణం, మాబు షరీఫ్, భాస్కర్, టిడిపి యూత్ వేణుగోపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, రాహుల్, శివ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

వైఎస్ఆర్ కడప జిల్లా, కడప సిటీ, దస్తగిరి జెండా వీధి, డోర్ నెం. 7/969-1లో నివాసం ఉంటున్న షేక్ గౌస్ కుమారుడు షేక్ జావిద్‌కు చెందిన పాస్‌పోర్ట్ మే 5వ తేదిన ఇంటి వద్ద నుంచి జిరాక్స్ చేయించుకోవడానికి వెళ్తుండగా నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **P5334478** పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకు గానీ **9704458254** మొబైల్ నెంబర్‌కు గానీ తెలుపగలరు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎడిఎ కృష్ణమూర్తి

మైదుకూరు మండలంలోని పలు దుకాణాల్లో ఎడిఎ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి బల గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాదికారుల ఆదేశాల ప్రకారం విత్తనాలు, ఎరువుల డీలర్ల దుకాణాలు తనిఖీ చేస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు బిల్లును రైతులకు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులను, విత్తనాలను దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని విత్తన దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేకుండా, అనామక వ్యక్తుల ద్వారా ఎలాంటి ఉత్పత్తులు కొనుగోలు చేయరాదని సూచించారు. నగదు బిల్లును రైతులకు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. కాలం చెల్లిన మందులను, విత్తనాలను దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదన్నారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డ్ అప్డేట్ చేయాలని పేర్కొన్నారు. అనుమతిలేని వాటిని రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గాని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే అనుమతి ఉన్న వాటిని కొనుగోలు చేసి నగదు బిల్లు పొందాలన్నారు.

దుకాణంలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎఒ శివమోహన్‌రెడ్డి

కార్యకర్త నుంచి సిడిపిఒగా రాణించడం గొప్ప విషయం

సావిత్రమ్మను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

అంగన్వాడీ కార్యకర్త నుంచి సిడిపిఒగా రాణించి ఉద్యోగ విరమణ పొందడం గొప్ప విషయమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్ కల్యాణమండపంలో చాపాడు ప్రాజెక్టు సిడిపిఒ సి.సావిత్రమ్మ ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీడీ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్‌గా విధుల్లో చేరి సూపర్వైజర్‌గా, సిడిపిఒగా రాణించి 44 సంవత్సరాలపాటు విధులు నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. సావిత్రమ్మ విధి నిర్వహణలో బాధ్యతగా ముందుకు సాగేవారని గుర్తు చేశారు. అధికారులు, సిబ్బంది పట్ల వినయంగా మెలిగే వారన్నారు. ఎంపిపి టి.లక్షుమయ్య మాట్లాడుతూ నూతనంగా ప్రాజెక్ట్ ఏర్పడిన సందర్భంలో సిడిపిఒగా బాధ్యతలు చేపట్టి ప్రాజెక్టును ముందంజలో నిలిపారని కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న సావిత్రమ్మను సిబ్బంది, బంధువులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్, వేముల ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, ఎఒ రామానుజం, ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, వివిధ ప్రాజెక్టుల సిడిపిఒలు హైమావతి, రాజేశ్వరి, ముంతాజ్ బేగం, శ్రీదేవి, లక్ష్మీదేవి, సునీత, శోభారాణి, మండల స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముకుందరెడ్డి సేవలు ఎనలేనివి

ముద్దనూరు :ఎంపిడిఒ అలవలపాటి ముకుందరెడ్డి విధుల పట్ల అంకితభావంతో మండల అభివృద్ధికి, ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి కొనియాడారు. ముద్దనూరు ఎంపిడిగా 8నెలలు పాటు విధులు నిర్వహించి ముకుందారెడ్డి శనివారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో జమ్మలమడుగు రహదారిలోని ఉమ్మడిశెట్టి గార్డెన్స్‌లో ముకుందరెడ్డికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. విధుల్లో తమ వంతు సహాయ సహకారాలు అందించిన ప్రజా ప్రతినిధులు, సిబ్బందికి ముకుందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు సూర్య నారాయణరెడ్డి, నాగప్రసాద్, డిప్యూటి ఎంపిడిఒ వీర భద్రుడు, ఎంఇఒ నాగేశ్వర నాయక్, ఎఒ వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సర్వసాధారణం : ఆర్‌డిఒ

సింహాద్రిపురం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విధుల నుంచి విరమణ సర్వసాధారణమని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, విఆర్‌ఒ రాజగోపాల్ ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ తహశీల్దార్ నాగేశ్వరరావు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. వేంపల్లి టిడిపి మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరావు, రాజగోపాల్ మండలంలో తక్కువ వ్యవధి పని చేసినప్పటికీ ప్రజా సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించి, వాటి పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తహశీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారం చాలా బాగుందన్నారు. అందరి సహకారంతోనే సమస్యలను పరిష్కరించామన్నారు. అనంతరం విరమణ పొందిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పులివెందుల, సింహాద్రిపురం ఎంపిడిఒలు శ్రీనివాసరెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐ రవికుమార్, డిప్యూటీ తహసిల్దార్ శ్రీహరి బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న ఆర్‌డిఒ చిన్నయ్య, సిబ్బంది

ఎడిఫై విద్యా సంస్థను ప్రారంభించిన మంత్రి 'మండిపల్లి'

స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎడిఫై స్కూల్‌ను రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపిపి ఎన్.రాఘవరెడ్డి ప్రారంభించారు. మండలం పరిధిలోని కామనూరు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ఎడిఫై విద్యా సంస్థలను ప్రారంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. ఎడిఫై స్కూల్ ఛైర్మన్ అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పెద్ద ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రొద్దుటూరు ప్రాంతానికి తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ స్కూల్ ద్వారా మంచి విద్యను విద్యార్థులకు అందించేలా దూర ప్రాంతాలకు వెళ్లకుండా అత్యాధునిక పద్ధతులలో ఎక్కడ కూడా రాజీలేకుండా విద్యను అంది స్తామన్నారు. ఎడిఫై స్కూల్ డైరెక్టర్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎడిఫై స్కూలు ప్రారంభించామని, బాల బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉంటుందన్నారు. ఈ ప్రాంతానికి స్కూల్ తీసుకురావడం అమర్నాథ్ రెడ్డి ప్రత్యేకమైన చొరవ చూపారన్నారు. ఎడిఫై ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం నుండి కడప, తిరుపతి ప్రాంతాల్లో ఇలాంటి స్కూలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మారుతి ప్రసాద్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా ముక్తియార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అభినందనలు అందుకుంటున్న ముక్తియార్

అంజుమన్ అహ లెఇస్లాం కమిటీ అధ్యక్షుడిగా ముక్తియార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఆసారెషరీఫ్‌లో అధ్యక్షుడితోపాటు ఇతర ఆఫీస్ బేరర్ల ఏకగ్రీవ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బొల్లవరం బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమూద్, కార్యదర్శిగా రిషి రియాజ్, సంయుక్త కార్యదర్శిగా నజీర్, వడ్ల బాబా బాషా, కోశాధికారిగా కొల్లూరు ఖాదరవల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కాలపరిమితి మూడేళ్లు ఉంటుంది.

గుర్తింపు 10 ఏళ్లకు పెంచడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె



బిఎస్ రమణారెడ్డి

రాష్ట్రంలోని ప్రయివేట్ పాఠశాలలకు ఇస్తున్న గుర్తింపును కూటమి ప్రభుత్వం ఎనిమిది నుంచి పదేళ్ల వరకు పెంచడం హర్షణీయమని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు బిఎస్ రమణారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 3న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతి నిధులతో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు మంత్రి లోకేష్ జిఒఎంఎస్ నెంబర్ 24ను జారీ చేయడం సంతోషకరమన్నారు. ప్రయివేట్ పాఠశాలల పట్ల ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి యూనియన్ తరఫున రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాలకు తోరణాలు కట్టొద్దు

- రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానియేల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పార్టీ తోరణాలు కట్టవద్దని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానియేల్ సూచించారు. రాష్ట్ర కార్యాలయంలో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు అరికట్టాలన్నారు. దళితులపై అధికారుల వేధింపులు, దాడులు ఆపడానికి వెంటనే కఠిన చట్టం తేవాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రతినెల ఆర్‌డిఒ సమక్షంలో దళితవాడల్లో అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన దళితులకు సాగుభూమిని వెంటనే కల్పించాలన్నారు. రాష్ట్రంలో దళితుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ 4 అమలు చేయాలన్నారు. ప్రాణహాని ఉన్న దళిత నాయకులకు వెంటనే రక్షణ కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో కౌంటర్ కేసులు నమోదు చేయకూడదన్నారు. పోలీస్‌స్టేషన్లో దళితులకు సమాన హక్కు కల్పించాలన్నారు. రాజ్యాంగంలో దళితులకు కేటాయించిన రిజర్వేషన్లను తప్పకుండా అమలు చేసి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక వినోద్ కుమార్, కమిటీ సభ్యులు రాష్ట్ర మాల మహానాడు గౌరవ అధ్యక్షులు సుద్దపల్లి మురళీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెళ్లికట్ల సాగర్, జిల్లా నాయకులు మేకల ఓబులేసు, సంగటి పుల్లయ్య, కిరణ్, అరుణ్, ప్రణయ్ పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పులివెందుల శ్రీరాజా కళానిలయం డాన్స్ అకాడమీ చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శన ఉంటుందని శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు విరివిగా పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మూతపడిన నాగసానిపల్లె గ్రామ సచివాలయం

గ్రామ సచివాలయం మూసివేత

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని నాగసానిపల్లె గ్రామ సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విధులకు ఎప్పుడు హాజరవుతారో ఎప్పుడు వెళ్తారో అర్థం కాని పరిస్థితి. గ్రామ సచివాలయాలపై ఉన్నత అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. శనివారం గ్రామ సచివాలయానికి వెళ్లిన కొందరు అక్కడ సిబ్బంది లేకపోవడంతోపాటు కార్యాలయ ద్వారం మూసివేశారు. కార్యాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయాల సిబ్బంది తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పలుమార్లు హెచ్చరించినా సిబ్బందిలో మార్పు కనపడకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ప్రజలు పేర్కొంటున్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహానాడు వేదికగా కడపలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గ నిరుద్యోగులు, ప్రజలకు వరాలు ప్రకటించినందుకు వారి తరఫున సిఎంకు కృతజ్ఞతలని టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మహానాడుతో జిల్లాలోని టిడిపి నాయకులలో, కార్యకర్తలలో, ప్రజలలో ముఖ్యమంత్రి నూతన ఉత్తేజం నింపారన్నారు. జూన్ 12 లోపు ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభం నుంచే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయన్నారు. గండికోట మన నియోజకవర్గంలో ఉండడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలోనే కాక దేశ స్థాయిలో గండికోటకు చరిత్ర ప్రకారంగా, గండికోట గ్రాండ్ కెన్యాన్ ద్వారా ప్రసిద్ధి చెందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే శ్రీకృష్ణదేవరాయుల 100 అడుగుల విగ్రహ ఏర్పాటు చేస్తామని చెప్పడం టూరిజంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. మహానాడుకు జమ్మలమడుగు నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేసినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జమ్మలమడుగు పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రాయల కిరణ్, చిన్నకొమెర్ల రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - లింగాల

ఆదివారం నుంచి రేషన్ పంపిణీ డీలర్ల ద్వారా ప్రారంభిస్తామని తహశీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. మండల పరిధిలోని వెలిదండ్ల రేషన్ షాపును శనివారం ఆయన తనిఖీ చేశారు. డీలర్ నీలావతితో మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడుగంటల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేపట్టాలన్నారు. వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇళ్ల వద్దకెళ్లి పంపణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ గంగధర యాదవ్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయంపై టిడిపి గొప్పలు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సామాజిక న్యాయంపై టిడిపి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టక ముందే, చంద్రబాబు రాజకీయాలలోకి రాకముందే కాంగ్రెస్ పార్టీ విద్య, ఉద్యోగాలలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు కాంగ్రెస్ చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు పుట్టకముందే 1970లోనే బిసిలకు విద్య, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. స్థానిక సంస్థలలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ కల్పించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో అమలు చేసిన సామాజిక న్యాయం అనే అంశాన్ని టిడిపి మహానాడులో ఆరు శాసనాలలో పెట్టడం విడ్డూరమని తులసిరెడ్డి విమర్శించారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో శనివారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల శరీర సౌష్టవం పెరుగుతుందన్నారు. మంచి జ్ఞాపకశక్తి వస్తుందన్నారు. లైబ్రేరియన్ గంగాధర్ రెడ్డి విద్యార్థులతో జిరాఫీ చెస్ కథను పాటను చెప్పించారు . జిరాఫీ చెస్ ఆటలోని మెలకువలను వివరించారు. కార్యక్రమంలో జిరాఫీ చెస్ శిక్షకులు నాగార్జున, అరవింద్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, హైస్కూల్ సిబ్బంది రెహ మాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.

యువతకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

పట్టణంలో చదువుకున్న నిరుద్యోగ యువతి, యువకులకు వ్యక్తిగత రుణాలు బ్యాంకుల ద్వారా ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆ మేరకు శనివారం ఆయన పట్టణంలోని కెనరా బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని తెలి పారు. వారికి స్వయం ఉపాధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలి పారు. రుణాలిస్తే యువత ఉపాధిలో రాణించే అవకాశం ఉందన్నారు. బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం లేదని యువత వాపోతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఎస్సీ,బీసీ, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రాయితీ రుణాల జాబితా ఇప్పటికీ రాలేదన్నారు. కనీసం వ్యక్తిగత రుణాలైనా మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. షరతులు లేకుండా అందరికీ రుణాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.